క్లుప్తంగా

శాంతిభద్రతల రక్షణలో పోలీసులు కీలకం

పెదపూడి: సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు విధుల, బాధ్యతలపై విద్యార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలని అనపర్తి ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ అన్నారు.పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అనపర్తిలోని సత్యభామ స్కూల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు కమ్యూనికేషన్ వ్యవస్థ, వీఐపీ బందోబస్తు విధుల గురించి వివరించారు. ప్రజలను, సమాజాన్ని రక్షించే క్రమంలో ఎందరో పోలీసులు వారి ప్రాణాలు కోల్పోయారన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు


వేంద్ర గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: భూసమస్యల పరిష్కారానికి రీసర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పి.వి. సీతాపతిరావు తెలిపారు. వేంద్ర గ్రామంలో సర్పంచి కోసూరి వాసు అధ్యక్షతన బుధవారం రీసర్వే గ్రామ సభనిర్వహించారు. ఈ సందర్భంగా సీతాపతిరావు మాట్లాడుతూ 32 అర్జీలు అందినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చిట్టి తల్లి, వీఆర్వో లంక కుమార్, బదిరెడ్డి చిట్టిబాబు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోర్త మురళీ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వాముల పాదయాత్ర


శబరిమలకు పాదయాత్ర చేస్తున్న స్వాములు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల నుంచి శబరిమలకు కాలినడకన బయలుదేరిన ఆరుగురు స్వాములు బుధవారం రాత్రికి తిరుపతి జిల్లా యేర్పాడుకు చేరుకున్నారు. ముగ్గళ్లకు చెందిన గుర్రాల స్వామి, బత్తిన శ్రీను, బోండు భాను, దూలం రమణ, రుద్రం శ్రీను, ఉమ్మిడి బుల్లిరాజు మాలధారణ దీక్ష ముగిసిన అనంతరం గత నెల 28న శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. మంగళవారం రాత్రి తిరుపతి జిల్లా బంగారప్పాడు చేరుకుని రామాలయంలో బస చేశారు. బుధవారం రాత్రికి యేర్పాడు చేరుకున్నారు. అనంతరం గురువారం మధ్యాహ్న తిరుపతికి వరకూ వెళ్లతామని వారు తెలిపారు.

వరి కోతలను వాయిదా వేసుకోవాలి


రంగంపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రంగంపేట: వాతావరణ మార్పుల వల్ల రెండు రోజుల వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కె.శ్రీనివాస్ రావు తెలిపారు.బుధవారం మండలంలోని రంగంపేట మండలంలో వడిశలేరు, రంగంపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు వివరాలు, కనీస మద్దతు ధరలు వివరించారు. రైతు తన నచ్చిన మిల్లుకి జీపీఎస్ అను సంధానమైన వాహనంలో తీసుకెళ్లి విక్రయించుకోవచ్చన్నారు. శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, చేనుపాస్ బుక్ జిరాక్స్ తీసుకురావాలన్నారు.ఎకరానికి 40 కిలోల వరకు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

రేపు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మిర్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ అన్నారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక, బొబ్బల్లంక, కూనవరం గ్రామాలకు, అలాగే ఉప కేంద్రం పరిధిలోగల వ్యవసాయ మోటార్లకు ఇండస్ట్రీయల్ ఫీడర్‌కు ఉదయం 8 మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

జి.మామిడాడ సెక్షన్ పరిధిలో..

పెదపూడి: మండలంలో జి.మామిడాడ సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్ భాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ జి.మామిడాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పైన, రాజుపాలెం , జి.మామిడాడ, గంగ్రేడు, వేంద్ర, పెద్దాడ, గ్రామాలకు , ఆక్వాసాగుకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

వంటింట్లో ధరల మంట

- సెగ పుట్టిస్తున్న రేట్లు
- విపరీతంగా పెరిగిన కూరగాయల ధరలు
- వంటనూనెలదీ అదే దారి
- బెంబేలెత్తుతున్న సామాన్యుడు

మధురపూడి: పెరిగిన కూరగాయలు, నిత్యావసరాల ధరలతో సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఏం కొనలేక, తినలేక అవస్థలు పడుతున్నాడు. ఆదాయంలో చాలా భాగం వీటికే ఖర్చు చేయాల్సి రావడంతో మిగిలిన అవసరాలు తీరడం లేదు. వాటి కోసం అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. మార్కెట్‌కు ఐదు వందల రూపాయలు తీసుకువెళ్లినా సంచి నిండా కూరగాయలు రావడం లేదు.

ప్రజలకు శాపం

పెరుగుతున్న ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు శాపంగా మారాయి. ముఖ్యంగా రోజువారీ ఆదాయంపై బతికేవారి జీవితం దుర్భరంగా మారింది. పెరుగుతున్న ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. నెలల తరబడి దిగిరాని ధరలతో వంటింట్లో ధరలు మంటలు సెగ పుట్టిస్తున్నాయి.


బూరుగుపూడిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు


కోరుకొండలో కూరగాయలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ధరలు చూస్తే వణుకే..

మార్కెట్‌లో కూరగాయల ధరలను చూసి సామాన్యుడు భయపడుతున్నాడు. కేజీ పచ్చిమిర్చి రూ.70, ఉల్లిపాయలు రూ.80, ఆకాకర రూ.120, టమాటా రూ.80, అల్లం రూ.80, వంకాయలు రూ.80, బీర కాయలు రూ.70 పలుకుతున్నాయి. ఆనబ కాయ ఒకటి రూ.70 లకు చేరడం ఇదే మొదటిసారి. కొత్తిమీర కట్ట రూ.40, మునగకాయ ఒకటి రూ.10గా ఉంది. ఇక కేజీ సీమదుంప రూ.60, దొండ, బంగాళ, బీట్‌రూట్, క్యారెట్ రూ.40కి చొప్పున పెరిగాయి. చింతపండు రూ.120 నుంచి కిందకు దిగిరానంటోంది.

వంటనూనెల సెగలు

కూటమి ప్రభుత్వం వంటనూనెల ధరలను అమాంతం పెంచింది. గతంతో పోల్చితే లీటరు ప్యాకెట్‌కు రూ.20 నుంచి రూ.30 పెరిగింది. మొత్తం ధర రూ.120 నుంచి రూ.150కే చేరింది. దిగుమతి సుంకం పెరగడంతో ఆయిల్ ధరలను పెంచినట్టు వ్యాపారస్తులు చెబుతున్నారు. ధరల అదుపు లేకుండా పెరగడంతో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సంపూర్ణ ఆరోగ్యం కోసం తాజా కూరలు తినాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. కానీ వాటి ధరలు అమాంతం పెరిగిపోవడంతో తాజా కూరగాయలు సరికదా, పాతవి కొనడానికి కూడా డబ్బులు సరిపోవడం లేదు.

ధరలను నియంత్రించాలి


పెరుగుతున్న ధరలను కూటమి ప్రభుత్వం నియంత్రించాలి. పెరిగిన ధరలతో ప్రజలు పౌష్టికాహారాన్ని పొందలేకపోతున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, నూనెల ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

– ఈతకొట్టు చినబాబు, జంబూపట్నం

ప్రజల ఇబ్బందులు


నిత్యవసరాలు, కూరగాయాల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పేదలు సంపాదిస్తున్న ఆదాయమంతా వీటికే సరిపోతోంది. పౌష్టికాహారం మాట పక్కన పెడితే, మామూలు ఆహారాన్ని కూడా తినలేకపోతున్నారు.

– బుద్దిగ సత్తిబాబు, బూరుగుపూడి

సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలి

పెదపూడి: గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చే చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు వినియోగించుకోవాలని కాకినాడ జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ) అధికారులు తుమ్మలపల్లి కుమార్ రాజా, రామకృష్ణ అన్నారు. మండలంలో పెద్దాడ, పెదపూడి, దోమాడ, కరకుదురు గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను వారు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఈ కేంద్రాల్లో వర్మీకంపోస్టు ఎరువు తయారీ, తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. క్లాప్ మిత్రాలు, ఈ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాస చౌదరి, ఉషా,కృష్ణారెడ్డి, బి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సంపద తయారీకేంద్రం వద్ద సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీపీఆర్‌సీ అధికారులు

క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం తథ్యం

రాజానగరం: క్రమశిక్షణతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని గ్లోబల్ డిగ్రీ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధి ఈ.రామారావు అన్నారు. దివాన్ చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాలలో విదేశీ విద్య అవకాశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ విద్యార్థి తనలోని మైండ్ పవర్‌ను సరైన క్రమంలో వినియోగించడం ద్వారా విజయాలను సాధిస్తాడన్నారు. సృష్టిలో ప్రతి ఒక్కరిలోనూ సమర్థత ఉంటుందని, దాన్ని గుర్తించి, వినియోగించుకునే వారే అభివృద్ధిలోకి వస్తారన్నారు. ఆత్మవిశ్వాసంతో మెలగాలని, అది లేకుంటే చేసే సాధన నిర్వీర్యమైపోతుందన్నారు. ఈ సందర్భంగా తమ సంస్థ ద్వారా విదేశీ విద్యకు ఉన్న అవకాశాలు, మార్గాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, చైర్‌పర్సన్ ఎస్.శకుంతల పాల్గొన్నారు.


విదేశీ విద్యపై అవగాహన కల్పిస్తున్న రామారావు

అణచివేద్దామంటే .. తిరుగుబాటు తప్పదు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: అణచి వేద్దామంటే ...తిరుగు బాటు తప్పదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు.మండలంలోని బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకుల సత్కార సభకు ఆయన అధ్యక్షత వహించి, మాట్లాడారు. కూటమి నాయకులు హామీలను అమలుచేయకుండా కాలయాపన చేస్తున్నారని, ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న భయంతో దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నేతలను అణిచివేద్దామంటే ..తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. మారుమాల గ్రామమైన ఇలపల్లిలో సర్పంచ్ లోల్లం భద్రంపై మీరు దాడి చేస్తే ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో...ఇక నుంచి ప్రతి సారి అలాగే కొనసాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు ఇచ్చామని ధైర్యంగా చెప్పమన్నారు. మీరు కూడా అమలు చేసి ధైర్యంగా చెప్పండని కూటమి నాయకులకు సూచించారు. మీ దౌర్జన్యాలను లెక్కచేయమని తెలపడానికి ఈ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరైన మా కార్యకర్తలే నిదర్శమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలో రావడం ఖాయమని, అప్పుడు రెట్టింపుగా బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. అనంతరం మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కురసాల కన్నాబాబు,రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రచారకమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, నాలుగు మండలాల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి,పోతుల ప్రసాద్‌రెడ్డి, గుత్తుల రమణ,నల్లా శ్రీనివాసరావు,అనపర్తి గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నల్లమిల్లి బాలకృష్ణారెడ్డి, కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ,కొంకుదురు సర్పంచి సత్తి వీరమణి, బిక్కవోలు మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి సత్యనారాయణ,బిక్కవోలు వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు,రంగాపురం సర్పంచ్ గండికోట వీరభద్రరావు,కొంకుదురుఎంపీటీసీ కొంకుదురు పీవీ, బలభద్రపురం వైఎస్సార్‌సీప గ్రామ శాఖ అధ్యక్షులు నల్లమిల్లి వెంకటరెడ్డి,కుతుకులూరు ఉపసర్పంచి సబ్బెళ్ల నాగిరెడ్డి, కోనాల సాయిరాం,హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వివిఎస్ఎన్,పందలపాక సొసైటీమాజీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి,వివిధ గ్రామ సర్పంచులు,ఎంపీటీసీలు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మృతి చెందిన కార్యకర్తల ఆత్మశాంతికి మౌనం పాటిస్తున్న నాయకులు


బలభద్రపురం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


సమావేశానికి హాజరైన కార్యకర్తలు,నాయకులు

ఎరువుల వాడకంపై నియంత్రణ అవసరం

రాజానగరం: పంట పరిరక్షణ, అధిక దిగుబడులు సాధించేందుకు ఎరువులు, పురుగు మందులను సిఫారసు చేసిన మేరకు మాత్రమే వాడాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. వెలుగుబందలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ఇదే క్రమంలో పొలంలో నత్రజని ఎరువులను అధికంగా వాడటం, పొటాష్ ఎరువును తక్కువగా వాడటం వలన తెగుళ్ల ఉధృతి పెరుగుతుందన్నారు. ఎల్లప్పుడూ ఒకే రకాలు కాకుండా అధిక దిగుబడులు ఇచ్చే నూతన వరి వంగడాలైన ఎన్ఎల్ఆర్ 34449, 2209ను వాడాలన్నారు. ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో ముక్కు, నోటిని పూర్తిగా మూసేలా మాస్కులు ధరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, శ్రీనివాస్, డీఆర్‌సీ జయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిమ్, మండల ఉద్యాన శాఖ అధికారి దివ్యగౌరి పాల్గొన్నారు.


వెలుగుబందలో మాట్లాడుతున్న డీఏవో మాధవరావు

కోరుకొండ మండలంలో..

మధురపూడి: రైతులు తమ ధాన్యాన్ని అనుకూలమైన రైసుమిల్లులకు ఇచ్చుకునే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు అన్నారు. కోరుకొండ, బూరుగుపూడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతులకు బ్యాంకు ఖాతాలలో నగదు జమ అవుతోందన్నారు. ధాన్యాన్ని జీపీఎస్ ఉన్న వాహనాల ద్వారానే పంపాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఉద్యానశాఖ మండల అధికారి రినీ, వ్యవసాయ మండల అధికారి గౌరీదేవి పాల్గొన్నారు.


బూరుగుపూడిలో సమావేశమైన అధికారులు, రైతులు

ఉపాధి పనుల్లో కూలీలను పెంచాలి

సీతానగరం: మండలంలో జరిగే ఉపాధి హామీ పథకం పనులలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో ఎం.భారతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జరగాలని, మూడు వేల మంది కూలీలతో పనులు చేపట్టాలన్నారు. రోజుకు రూ.300 వచ్చేలా కొలతల ప్రకారం పని చేయించాలన్నారు. వ్యక్తిగత పనులైన ఇంకుడు గుంటలను అన్ని గ్రామాల్లో గుర్తించాలన్నారు. రైతుల పొలాల్లో సేద్యపు నీటిగుంటలను గుర్తించి పనులు పూర్తి చేయాలన్నారు. ప్లాంటేషన్ పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. పల్లె వనం కోసం 25 సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించాలన్నారు. ఏపీవో కె.నాగ శేషవేణి, ఎన్ఆర్ఈజీఎస్ టీఏ చక్రవర్తి, సీవోలు మోహిద్దీన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భారతి

శనగలో విత్తనశుద్ధిపై అవగాహన

రాజానగరం: దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నైరా కళాశాలకు చెందిన వ్యవసాయ విద్యార్థులు స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం శనగలో విత్తనశుద్ధిపై ప్రదర్శన నిర్వహించారు. తొలుత కొందరు రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైజోబియంతో శనగ విత్తనశుద్ధి చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. 25 గ్రాముల రైజోబియం పొడిని, ఒక కిలో విత్తనాలతో కలిపి, తగినంతగా బెల్లం నీళ్లను పట్టించాలన్నారు. తద్వారా భూమిలో నత్రజని స్థిరీకరణ జరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని యజ్ఞశ్రీ అనే విద్యార్థిని వివరించింది. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


విత్తనశుద్ధిని ప్రయోగాత్మకంగా చేసి చూపుతున్న వ్యవసాయ విద్యార్థినులు

గ్రామసభకు 35 అర్జీలు

బిక్కవోలు: మండలంలోని ఆరికరేవుల గ్రామంలో భూ సర్వేలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రెడ్డి నాగవేణి కుమారి మాట్లాడుతూ రైతులు ఈ సభ ద్వారా భూ సమస్య పరిష్కారించుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు రైతుల నుంచి 35 అర్జీలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజానగరం: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కొందరు స్వార్థపరులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలను అదుపు చేయడంలో యువత ప్రముఖ పాత్ర వహించాలని బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అవసరం మేరకే సెల్‌ఫోన్ల వినియోగించాలని, అవగాహన లేకుండా ఎటువంటి లింకులను ఓపెన్ చేయరాదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విమల, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి,చెడులను అంచనా వేయాలి


రంగంపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణసాయి

రంగంపేట:ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు అమర వీరుల దినోత్సవం వార్సోవత్సాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు పోలీసు విధుల గురించి ఎస్ఐ తోట కృష్ణసాయి వివరించారు. రంగంపేట పోలీసు స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి ప్రతి విషయాని తెలుసుకోవాలన్నారు.వాటిలో మంచి విషయాని గ్రహించి దానికి అనుగుణంగా మార్గం ప్రయాణించాలన్నారు.సమాజంలో జరిగే మంచి చెడ్డులను అంచానా వేయాలని సూచించారు.

మాక్ పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన

పెదపూడి: మాక్ పోలింగ్‌తో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలుగుతుందని, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని అనపర్తి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కర్రి కల్యాణి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ్ అప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల్లో 6 తరగతి విద్యార్థులకు యాక్టివెన్ క్లబ్ ద్వారా బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు మాక్ పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొని అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మంగపర్తి కీర్తన, ఉపాధ్యక్షురాలిగా చిట్టూరి సిరివల్లిని ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి అధ్యక్షులు, ఉపాధ్యక్షులుచే ప్రమాణాస్వీకారం చేయించారు.


అనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కేపీఆర్ ఫ్యాక్టరీని పరిశీలించిన జేసీ


కేపీఆర్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

బిక్కవోలు: స్థానిక కేపీఆర్ ఫ్యాక్టరీని తూర్పుగోదావరిజిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు బుధవారం పరిశీలించారు. కేపీఆర్ సంస్థ తయారు చేస్తున్న గంధకం లైసెన్స్ రెన్యూవల్ చేయడానికి యాజయాన్యం దరఖాస్తు చేసుకోడంతో ఆయన పరిశీలనకు వచ్చారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ,ఆర్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం


సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వాహనాలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఆటో డ్రైవర్, ద్విచక్ర వాహన చోదకుడికి మధ్య జరిగిన వాగ్వాదంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోడ్డు మధ్యలో వాహనాలను నిలిపివేసి వారిద్దరూ గొడవ పడ్డారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి, ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి రాజమహేంద్రవం వైపు నుంచి వస్తున్న ఆటో.. ఇసుక ట్రాక్టర్‌ను తప్పించి ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌కు అడ్డు వచ్చింది. ఈ నేపథ్యంలో గొడవ జరిగింది. సుమారు అరగంట ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి రోడ్డుపై అడ్డుగా ఉన్న ఆటోను తీయించారు. కాగా.. బస్టాండ్ సెంటర్‌లో నిత్యం ఇలాంటి ఘర్షణలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు ప్రతి రోజూ సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.